# అయ్యారే...!

"అయ్యారే !... ఆశ్చర్యం... అద్భుతం !" కాలం కౌగిట్లో కరిగిపోయిన ఐదేళ్ల తర్వాత, శ్రావణ శుక్రవారం నాడు ... లక్ష్మీదేవిలా తనింట్లోకి నడిచొస్తున్న ప్రాణ స్నేహితురాలు కన్పించగానే, మందాకినిలో చిలిపిదనం చెంగలించింది. మనసు లేడికూనలా గంతులేసింది. ఒక్క ఉదుటున ఎదురెళ్లి ఆప్యాయంగా గుండెలకు హత్తుకుంది.

సర్కారు దవాఖానా డాక్టరైన శ్రీవారి ట్రాన్స్‌ఫర్ మీద ఆ సిటీకొచ్చి మూడ్రోజులైనా ప్రాణస్నేహితురాలిని ఫోన్‌లోనే తప్ప, పర్సనల్‌గా కలుసుకునే అవకాశం రాలేదు. ఇప్పుడు తానే ప్రత్యక్షమైంది.

"ఏమే రోకలీ ! నూకలిస్తా మేకలు కాస్తావా !" స్వేచ్ఛావిహంగాల్లా గడిపిన రోజుల్ని నెమరేసుకుంటూ బుగ్గ గిల్లింది. చంకలో రబ్బరు బొమ్మలాగున్న పసిదాన్ని ఆత్రంగా అందుకుని లేత బుగ్గల మీద ముద్దుల వర్షం కురిపించింది. వాళ్లిద్దరూ ఒకే హాస్టల్ రూంలో ఉంటూ ఒకే కాలేజీ క్షేత్రంలో విద్యావ్యవసాయం సాగించారు. పెళ్లిళ్లవగా ఎవరి గూటికి వాళ్లెగిరిపోయారు. హాస్టల్ మేట్సు ఆటపట్టింపులో రోహిణి రోకలిగా సెటిలైంది.

రోహిణి పెదాల మీదో బలవంతపు చిరునవ్వు మెరిసి వేడిపెనమ్మీద నీటి చుక్కలా మాయమైంది. హ్యాండు బ్యాగు పక్కన బెట్టి మొదలు నరికిన చెట్టులా సోఫాలో కూలబడింది. ఆలోచనలు గవర్నమెంటాఫీసులో సూపర్వైజరైన భర్త చుట్టూ వలయాలుగా తిరుగుతున్నాయి.

అల్లరిలో అందె వేసిన చెయ్యనుకునే రోహిణి ఇలాగైందేమిటీ ? మందాకిని కేమీ అర్థం కాలేదు.

❋ ❋ ❋

"కన్నెమనసు కొంటె కోర్కెలు సాకారమయేది కట్టుకన్నవాడి కౌగిట్లో కరిగి పోయేటప్పుడే. ఆ ముద్దు మురి'పాల' కమ్మదనం కోరుకునేది కడుపు పండాలని. ఆడ జన్మ సార్థమయేది 'అమ్మా !' అనే తియ్యని పిలుపుతో."

మొదటి కాన్పుకు తనను పుట్టింటికి పంపిస్తూ భర్త శ్రీనివాసు అన్నమాటలు, కడుపు పంట పసిపాపతో మెట్టినింటి కొస్తున్న రోహిణికి గిలిగింతలు పెట్టాయి. అన్నయ్యతో రైలు దిగి ఆటోలో కూచుంది.

ఐదో నెలలో అడుగు పెట్టిన చిన్నారి కూతురు చెంపలు నిమురుతూ "మనం

మనింటికెళ్తున్నాం బుజ్జీ !" చెవిలో చెప్పింది.

పాపకేమర్థమైందో గాని కిలుక్కున నవ్వింది. ఆడజన్మ కింత కంటే ఇంకేం కావాలి ? అనుకుంటూ మురిసిపోయింది. ఇంటికి తాళం కప్ప వేళ్లాడ్తోంది. తన దగ్గరున్న తాళం చెవి అన్నయ్య కందించింది. "బావగారు ఆఫీసుకెళ్లినట్టుంది" అంటూ తాళం తీశాడు. "ఆయన ఇంట్లో ఉంటే ఈ పాటికి ఎగిరి గంతేసే వారన్నయ్యా !" అంది, పాపను మంచమ్మీద పడుకోబెడుతూ. కాఫీ తాగి అన్నయ్య వెళ్లిపోయాడు.

ఆపసోపాలు పడుతూ శ్రీనివాసు ఇంటికొచ్చేసరికి రాత్రి చిక్కబడింది.

పసిపాప పాలు తాగి నిశ్చింతగా నిద్రలోకి జారుకుంది.

మళ్లీ ఈయన అల్లరి... ఏ క్షణాన్నైనా వెనక నుంచి వచ్చి.... మధురోహల గిలిగింతల్లోంచి తేరుకుంది.

"ఎలాగున్నారండీ ?" లుంగీ అందిస్తూ అడిగింది.

"ఇదో ... ఇలాగున్నాను" నవ్వాలనే ప్రయత్నంలో నిట్టూర్పు వెలువడింది. శ్రీనివాసు గొంతులో ముందటి గమకం లేదు.

"నేనీ రోజు పాపతో వస్తున్నానని తెలుసు గదా !" నున్నని బుగ్గల మీంచి సన్నని సిగ్గులు జారిపోతుంటే గుండె మీద ఒరిగిపోయింది. ఆరు నెలల తర్వాత ఈ హాయి... నందనవనంలో విహరిస్తున్నట్టుంది. చేతులు భుజాల మీదున్నాయి.

"ఆఁ... ఆఁ.. తెలుసనుకో...." భుజాల మీది చేతుల్ని నాజూగ్గా పక్కకు జరిపి, దూరం జరిగాడు.

మధుమాసంలో మావిచిగురు భోంచేస్తున్న కోయిల గొంతులో వేపకాయ ఇరుక్కున్నట్టైంది. రోహిణి ఎద పొదల్లో అలజడి ఛాయలు.

"రండి ... భోంచేద్దాం" చెయ్యందుకుంది.

"న్నే ... నే.. నేను పార్టీకెళ్లాను. నువ్వు భోంచెయ్" విడిపించుకుని గదిలో కెళ్లిపోయాడు.

కన్నకూతురు మొహాన్ని కన్నెత్తైనా చూడకుండా మంచమ్మీద ఒరిగిపోయాడు.

ఈయనకేమైందీ ? రోహిణి మనసు చివుక్కుమంది.

మూడ్రోజులు పుట్టింటి కెళ్లొస్తే మూడుయుగాలు గడిచినట్టు... గిలిగింతలు పెడుతూ గమ్మత్తుగా ఎగబడేవాడు. రెచ్చిపోయి ఏదేదో చేసేవాడు.

మోజు తీరిందా ? శ్రీనివాసుని హృదయ పీఠమ్మీద ఏ బీబీనాంచారో తిష్ట వేయలేదు గదా ! అలా అయుండదు. ఆఫీసులో బాగా పంజేసి అలిసిపోయుంటాడు.

మనిషి ఓడిపోయింది. మనసు రాజీ పడింది. వంటిల్లు సర్దేసి పాప పక్కన ఒరిగిపోయింది.

మర్నాడు... నిన్నటి అనుభవాన్ని నీటి బుడగగా భావించి భవిష్యత్తు బాట వైపు దృష్టి సారించింది. ఇంట్లో అతను తప్ప మరో మనిషి లేనట్టుగా యాంత్రికంగా తయారై వెళ్లిపోయాడు. ఆఫీసు కెళ్లే ముందు మెత్తని పెదాలతో, సుతిమెత్తని పెదాల మీద రోజువారీ మామూలు... మరిచి పోయుంటాడు. అయినా... ఎప్పుడూ అరవిరిసిన గులాబీలా గుండే ఆ మొహమ్మీద ఆ నాటి కళ లేదేమిటీ ? మనిషిలో ఏదో మార్పు గోచరిస్తుంది. అయిదున్నర లోగా ఇంటికొస్తాడు గదా ! రాగనే ఏదన్నా సినిమాకు లాక్కెళ్లాలి అనుకుంది. రాత్రి ఎనిమిది తర్వాత పిల్లినడకతో వచ్చాడు. చేతిలో మల్లెదండ కూడా లేదు. ట్యూబులైటు వెలుతురులో ముఖవర్చస్సు మబ్బు పట్టిన ఆకాశం లాగుంది.

"ఇదో చూడండి. మన బంగారు తల్లి ఎంత ముద్దొస్తుందో !" కాళ్లూ చేతు లాడిస్తున్న పాపనందించబోయింది.

"నేనేం చూడాలటా ? నిద్ర బుచ్చు" చిరాగ్గా తానే లుంగీ అందుకున్నాడు. చేదు మందు తింటున్నట్టు మూడు ముద్దల్లో భోజనం ముగించాడు. "తిన్నావా ?" అని కూడా అడగలేదు. జోకులు విసురుకుంటూ, సరస సల్లాపాలతో కలిసి భోంచెయ్యక ఎన్ని రోజులైందో ! ఏడుపొచ్చినంత పనైంది. నాలుగు మెతుకులు గతికి, వంటిల్లు సర్ది వచ్చేసరికి అటువైపు తిరిగి పడుకున్నాడు. మాటలు కూడా లేవు.

ఐదారు రోజులు అదే తంతు.

భార్యాభర్తల అనుబంధాన్ని ఆడది గాజుబొమ్మలా కాపాడుకుంటుంది. మగ మహారాజు అలా కాదు. బంధాలన్నీ తాత్కాలికమే అనుకుని, అనురాగాన్ని హాకీబాల్ గా మార్చేసి, నిర్లక్ష్యమనే స్టిక్‌తో నిరంతరం ఆడుకుంటాడు. ఈ మధ్య పత్రికలో చదివింది నిజమేనేమో !

రోజులు గడిచే కొద్దీ హృదయసముద్ర ఘోష సునామీగా రూపాంతరం చెందు తోంది. ఆదివారం నాడు గూడా అదే వెలాసిటీతో తయారై బయటి కెళ్లబోతుంటె అడ్డుకుంది. "ఇవ్వాళ్ల పాపతో బయటికెళ్లి సరదాగా గడిపేద్దామండీ !" ప్రతిపాదించింది.

చట్టసభలో ప్రైవేటు బిల్లులా ప్రతిపాదన వీగిపోయింది.

"పోనీ... సినిమాకన్నా వెళ్దామండీ !"

"ఎందుకటా ?" కుర్చీలో కూలబడ్డాడు.

"ఎందుకేమిటీ ! నేనొచ్చినప్పట్నుంచీ గమనిస్తున్నాను. మీరు ముందట్లా లేరు. పాప బారసాలకు మా ఊరొచ్చినప్పుడు హుషారుగానే ఉంటిరి గదా !" కుర్చీ పక్కకు జరుపుక్కూచుంది.

"ఇప్పుడేమైందనీ ? ఇంట్లో సరకులు నిండుకుంటే లిస్టు రాసివ్వు, పట్టుకొస్తా" మొహం పక్కకు తిప్పుకున్నాడు.

"లిస్టు రెడీగా ఉంది. నిండుకున్న ఆ సరకులు బజార్లో దొరకవు" అతని మొహాన్ని తనవైపు తిప్పుకుంది.

"బజారులో దొరకనివా ? అవేమిటీ ?" కళ్లు దించుకున్నాడు.

"భర్త ప్రేమానురాగాలు. పాపకు కన్న తండ్రి ముద్దూ ముచ్చట."

"అబ్బా... ఇప్పుడేమైందటా ?"

"ఏమైందో మీరే చెప్పాలి. మీరెందుకిలా అంటకుండా, ముట్టకుండా ఉంటున్నారో కారణం చెప్పాలి." ఉక్రోషం ఉబికొస్తోంది. "నేనేమైనా పొరపాటు చేశానా? మా పుట్టింటి వాళ్లేమన్నా అగౌరవ పరిచారా ?" లోపలి సునామి పైకొచ్చి కళ్లల్లో కరుగుతూంటే గొంతు జీరబోయింది.

"అదేం లేదే !"

"మరి... మాకెందుకీ శిక్ష ?"

"శిక్షనా ?" నిర్వేదపు చిరునవ్వు. "నువ్వేదేదో ఊహించుకుని బాధ పడొద్దు. పాపను జాగ్రత్తగా చూసుకో." ఏదో గుర్తుకొచ్చినట్టు గబుక్కున లేచి వెళ్లిపోయాడు. ప్రయత్నాలన్నీ బూడిదలో పన్నీరై పోతున్నై.

మరిన్ని రోజులు మొహమాటంగా గడిచాయి.

భర్త నిరాదరణకు మించి శిక్ష భారత స్త్రీకి మరోటి లేదు. అనురాగబంధం ముడులు వదులైన భార్యాభర్తల జీవనశైలి, ఏనుగు మింగిన వెలగపండు లాంటిది.

భగవంతుడా ! మా పచ్చని సంసారంలో ఏమిటీ చిచ్చు ? నేనేం పాపం చేశాను? బోసినవ్వుల వెలుగుల్లో కేరింతలు కొడుతూ కన్నతండ్రి గుండెల మీదాడు కోవాల్సిన పసికూన కెందుకీ దుర్గతి ? ఎందుకీ శాపం ? కుమిలిపోయింది.

సహనం హద్దులు దాటింది. ఆవేశం లోంచి ఆవేదన పొంగుకొచ్చింది. టిఫిన్ కోసం డైనింగ్ టేబుల్ ముందు కూచున్న భర్తకు వేడి ఇడ్లీలు, కొబ్బరి చట్నీ వడ్డిస్తూ.

"ఏమండీ !" ఆవేశాన్నంతా గొంతులో బందీ చేసి "మీకిది న్యాయంగా ఉందా?" దీనంగా అడిగింది. కళ్లలోకి చూడాలనే ప్రయత్నం విఫలమైంది.

"ఏమైంది రోహిణీ ?" తానే తలెత్తి చూశాడు.

ఆ కళ్లల్లో మునుపటి కాంతిరేఖలు మచ్చుకైనా లేవు. చూపుల్లో చురుకుదనం కొరవడి కొడిగట్టిన దీపాల్లాగున్నాయి.

"మీరు ముందట్లాగా లేరు. మిమ్మల్ని చూస్తే భయమేస్తుంది. ఆఫీసులో ఏదన్నా గొడవనా ? ఎవరన్నా బ్లాక్‌మెయిల్ చేస్తున్నారా ? ఒకరి కష్టసుఖాల్లో ఒకరం పాలు పంచుకుంటామని పెళ్లిలో ప్రమాణాలు చేశాం గదా ?" చేతులు పట్టుకు బతిమాలింది.

చూపులు నేలకు వాలినై. "అదేమీ కాదు..."

"ఆడపిల్ల పుట్టిందని అలకనా ?"

"అలకైనా, గిలకైనా అది మన చేతుల్లో లేదు గదా. పసిదాని గురించి అట్లా అనుకోవడం పాపం గదా !"

"నిజమే. మరేమిటిదంతా ?"

"అంతా... నా దురదృష్టం !"

నేలకొట్టిన బంతిలా లేచి చరచరా వెళ్లిపోయాడు. ఇడ్లీలు ప్లేట్లోనే చల్లారి పోయినై. ఆవేశం అడుగంటి పోయింది.

ఇప్పుడేం చెయ్యాలి ? ఎవరి నాశ్రయించాలి ? నెత్తి కొట్టుకుంది. మనసు పొరల్లో మందాకిని మెదిలింది.

❋❋❋

ఆ శనివారం నాడు ... శనేశ్వరుడు నెత్తి మీద కూచున్నాడేమో ... పేరుకుపోయిన ఫైళ్లతో కుస్తీ పడుతూ బిజీగా ఉన్నాడు శ్రీనివాసు.

"శ్రీనివాసుగారూ !" స్నేహితుడు, వాసవి క్లబ్బు కార్యదర్శి వచ్చి ముందు కూచున్నాడు. "రేపు ఆదివారం గదా ! క్లబ్ తరపున రక్తదాన శిబిరం ఏర్పాటు చేశాము. మీరు గూడా ఈ పుణ్యకార్యంలో పాల్గొని రక్తదానం చెయ్యండి."

"తప్పకుండా చేస్తా ..."

"థ్యాంక్యూ ! దానికి ముందు మీరు ఈ రోజే రక్తపరీక్ష చేయించు కోవాలి" చిరునవ్వు.

"ఎందుకటా ?" ముందున్న ఫైళ్లు పక్కకు జరిపాడు. "నా రక్తం గ్రూపు నాకు తెలుసు."

"అయినా... హెచ్.ఐ.వీ. పరీక్ష కోసం కంపల్సరీ చేయించుకోవాలి. ఎందుకంటే ఎయిడ్స్ భూతం ఏ మనిషిలో ఎప్పుడెలా ప్రవేశిస్తుందో చెప్పలేం. హెచ్.ఐ.వి. పాజిటివ్ వచ్చినవారి రక్తం ఎవ్వరికీ పనికి రాదు గదా ! ఇదో తప్పనిసరి ఫార్మాలిటీ ... ఏమీ అనుకోవద్దు" చెయ్యందుకుని షేక్ హాండిచ్చాడు.

"సరే. రక్త పరీక్ష కోసం సాయంత్రం ఎక్కడికి రావాలి ?"

"సాయంత్రం ఐదున్నరకు విమలా డయాగ్నిస్టిక్స్ సెంటర్ కొచ్చి రక్తమిచ్చి వెళ్ళండి. రిపోర్ట్ మేం కలెక్టు చేసుకుంటాం" లేచి నుంచున్నాడు.

"తప్పకుండా వస్తాను. ఇంట్లో ఒంటరి గానే ఉన్నాను. వెళ్లాలనే తొందర లేదు."

"ఎందుకలా ?"

"నా భార్య మొదటి కాన్పుకు పుట్టింటికెళ్లింది."

"ఐతే తండ్రి కాబోతున్నారన్న మాటా. కంగ్రాట్స్ !"

"తండ్రి నయాను. పాప బారసాల కెళ్లొచ్చాను."

విమలా డయాగ్నిస్టిక్స్ సెంటర్లో రక్తమిస్తుంటే ఎంతో తృప్తిగా ఉంది.

మర్నాడు ఆదివారం. మధ్యతరగతి మందహాస జీవులకు ఆటపట్టు. ఆలస్యంగా నిద్ర లేచిన సిటీ ఆవులిస్తోంది.

మనోవేగంతో వెళ్లి రక్తదాన శిబిరానికి ఏర్పాట్లు చేసుకోవాలనుకున్న వాసవి క్లబ్బు కార్యదర్శి వాయువేగంతో స్ప్లెండర్ బండెక్కి అశ్వవేగంతో ప్రయాణించాడు. శ్రీనివాస్ ఇంటిముందు దిగి హంస నడకతో లోపలికొచ్చాడు.

"ఓహ్ ... మీరా ! రండి. కూచోండి" సాదరంగా ఎదురొచ్చి స్వాగతం పలికాడు శ్రీనివాసు. "సారీ ! ఒంటరి వాణ్ని గదా. చాయగూడా ఆఫర్ చెయ్యలేకపోతున్నాను."

"పరవాలేదు. మీ బెటరాఫ్ లేరని చెప్పారు గదా" సోషల్ సర్వీసంటే ఇలా గుండాలి. రక్తదానం గురించి గుర్తు చేసేందుకు స్వయంగా వచ్చాడు కార్యదర్శి అనుకున్నాడు.

"ఈ రోజు రక్తదానం చెయ్యాలని గుర్తుంది సార్ ! ఎప్పుడు ఎక్కడికి రావాలో చెప్పండి. నా సాంపుల్ బ్లడ్ రిపోర్టు కలెక్టు చేసుకున్నారు గదూ !" శ్రీనివాసులో ఉత్సాహం ఉరక లేస్తోంది. ఓ మంచి పని చెయ్యబోతున్నాననే ఆనందమది.

"రిపోర్టు వచ్చింది. మీకంత శ్రమ అవసరం లేదు." రిపోర్టు అందిస్తూంటే చేతులు వణికాయి. గొంతులో ఏదో అలజడి.

"శ్రమ ఏముంది సార్ ? పరోపకారం కోసమే శరీరమన్నారు గదా..." రిపోర్టు విప్పి చూశాడు. కళ్లు విశాలమైనాయి.

"ఆఁ ... ఇదేమిటీ ?" నెత్తి మీద నాగుంబాము పడ్డట్టు అదిరిపోయాడు. "రిపోర్టులో హెచ్ఐవి పాజిటివ్ అని వచ్చిందా ?" హడలెత్తించింది.

"అవును సార్ ! బ్యాడ్ లక్ మై డియర్ ఫ్రెండ్ !"

"అ...యి...తే న్నే...ను ఎయిడ్స్ రోగినన్నమాటా !" బుర్రలో భూగోళం గిర్రు గిర్రుమంటూంటే తల పట్టుక్కూచున్నాడు. నమ్మలేక రిపోర్టు కాయితాన్ని అటూ ఇటూ తిరగేసి చూశాడు. దాని మీద తన పేరే వుంది. నిజమే !

"సారీ ! మీరంతగా కుంగిపోవాల్సిన అవసరం లేదు. ఈ రోజుల్లో ఎయిడ్స్ రోగులు మన దేశంలోనే ఎక్కువున్నారు. ఇది దైవ నిర్ణయం. మానవమాత్రులం మనమేమీ చెయ్యలేదు. కాబట్టి బాధపడాల్సిందేమీ లేదు సార్ ! ప్రశాంతంగా, నిశ్చింతగా ఉండాలి..." ఇంకేమోమో సముదాయించి వెళ్లిపోయాడు కార్యదర్శి.

సుడిగుండాల్లో చిక్కుకున్నట్టుంది.

ఏకపత్నీవ్రతుడిని గదా ! పరస్త్రీని తల్లిగానో, చెల్లిగానో భావిస్తున్నాను గదా ! ఈ ఎయిడ్స్ భూతం నన్నెట్లా ఆవరించిందో ! జుట్టు పీక్కున్నాడు.

ఆ మధ్య చికెన్ గున్యా జ్వరం, ప్రభుత్వాసుపత్రిలో ఇంజెక్షన్లు ... ఎయిడ్స్ రోగికి వాడిన సూది, నా రక్తాన్ని రుచి చూసిందేమో ! సెలూన్‌లో షేవింగాయె. ఏ బ్లేడు వాడారో ఏమో ! అంతా నా దౌర్భాగ్యం... భగవాన్ ఇప్పుడేం చెయ్యాలి ?

ఆఫీసు హడావుడేమీ శ్రీనివాసు దృష్టి మరల్చలేకపోతోంది. మనిషిగా ఆఫీసు సూపర్వైజర్ కుర్చీలో కూచున్నా, మనసు తెరమీద మాయదారి దృశ్యాలు కదుల్తున్నాయి. 'నా ఆవేదన నెవరికి చెప్పుకోవాలి ? ముద్దుల కూతురు కళ్ల ముందున్నా... పసిదాన్ని ముట్టుకోలేని దౌర్భాగ్యం. రోహిణి ఎంత బాధ పడుతుందో ! మరణం తప్ప మరో పరిష్కారం లేని రోగం గురించి చెబితే గుండె పగలి నోరు తెరుస్తుంది. నా వింత ప్రవర్తన... నిరాదరణ భరించలేదేమో ! పాపతో సహా ఎటుపోయిందో ! ఎన్ని బాధలు పడుతుందో ! మొహమ్మీది రక్తమంతా ఇంకిపోయింది. బలవంతంగా ఫైలందుకోబోయాడు.

"సార్, మిమ్మల్ని ఆఫీసరు గారు రమ్మంటున్నారు" సుడిగాలిలా వచ్చి చెప్పిన అటెండరు కింది నుంచి మీద్దాకా చూసి పైరగాలిలా వెళ్లిపోయాడు.

సీట్లోంచి భారంగా లేచాడు శ్రీనివాసు.

***

"మందాకినీ ! మీ స్నేహితురాలు మామూలు మూడ్‌లో కొచ్చినట్టేనా ?" హాస్పిటల్ డ్యూటీ ముగించుకుని వచ్చిన డాక్టర్ సూర్యనారాయణ, సాక్సు విప్పుకుంటూ భార్య నడిగాడు.

"పూర్తిగా రాలేదు గానీ విషయం చెప్పింది. పాపం ! అది కాన్పుకెళ్లేప్పుడు భర్త ఆరోగ్యంగా, అన్యోన్యంగా ఉండే వాడట. పొత్తిళ్ల పాపతో పుట్టింటి నుండి వచ్చి నెల రోజులైనా అంటరాని మనిషిలా దూరదూర ముంటున్నాడటా. వింత ప్రవర్తన ఎందుకంటే తప్పించుకుంటాడటా..." రోహిణి చెప్పిందంతా చెప్పేసింది.

పాపను నిద్రబుచ్చి గదిలోంచి బయటి కొచ్చింది రోహిణి.

నేరుగా మాట్లాడాలనిపించింది సూర్యనారాయణకు.

"రోహిణి గారూ ! వారం తర్వాతన్నా విషయం చెప్పారు. మీరెన్ని రోజులిక్కడున్నా మాకభ్యంతరం లేదు. మీ కభ్యంతరం లేక పోతే మీ భర్త వివరాలు చెప్పండి."

రోహిణి కళ్లల్లో బేలతనం... మొహం ముడుచుకునుంది.

"ప్లీజ్ చెప్పు రోహిణీ !" చెయ్యి బట్టి సోఫాలో తన పక్కన కూచోబెట్టుకుంది మందాకిని. "నువ్వసలూ ... ఇక్ష్వాకుల కాలంలో ఉండాల్సిన దానివే. ఈ రోజుల్లో ఆడదంటే అబల కాదు సబల. డిగ్రీదాకా చదువు వెలగబెట్టి నువ్వేమో చలివిడి ముద్ద లాగైపోయి ఆత్మస్థయిర్యం పోగొట్టుకుంటివి. ఆయనలా అడుగుతున్నారంటే కేవలం నీకేదన్నా సహాయం చెయ్యాలనే తల్లీ !" గదవ బట్టి బతిమాలింది.

ఆపదలో ఆదుకునేవారే అసలైన స్నేహితులు. స్నేహం నీడనిచ్చే చెట్టు లాంటి దంటారు. ఊపిరి పీల్చుకుంది రోహిణి. "మా వారి పేరు శ్రీనివాసు..." పేలవంగా నవ్వబోయింది.

"శ్రీనివాసా ?" సూర్యనారాయణ కనురెప్పలు ఆశ్చర్యంగా పైకి లేచినై. "ఈ రోజు మా హాస్పిటల్లో శ్రీనివాసనే ఎయిడ్స్ రోగి చనిపోయాడండీ ! ఆయనకెవరూ లేరటా."

"హాఁ... ?" రోహిణి గుండె గుబేల్ మంది. "అయితే మా ఆయనకు ఎయిడ్స్ సోకి ఉంటుంది. చెప్పలేక, ఏమీ చెయ్యలేక మథనపడ్డాడండీ !" వెర్రిగా నెత్తికొట్టుకుంది. బోర్‌మంది.

"అయ్యయ్యో ! ఆ శ్రీనివాసే దీని భర్తా !" మందాకిని ఆందోళన. స్నేహితురాలు భుజాలు పట్టుకుని ఊరడిస్తోంది.

రోహిణి ఆవేదన, మందాకిని బాధ, డాక్టర్ సూర్యనారాయణ సానుభూతి ... ఉన్న పళంగా అందరినీ హాస్పిటల్ చేర్చి, మార్చురీలో శ్రీనివాసు శవం ముందుంచాయి. ఎగదన్నుకొస్తున్న ఎసరును పంటిబిగువున అదిమి పెట్టింది రోహిణి. పాపను మందాకిని కందించింది. ఊపిరి బిగపట్టి వణికే చేతులతో శం మొహమ్మీది గుడ్డ తొలగించింది.

"ఆఁ... హాఁ..!" కళ్లు కొౌచిప్పలైపోయినై. మెదడు పొరల్లోని తుఫాను అయోమయంగా రూపాంతరం చెందుతూంటే, అవాక్కైపోయింది.

"ఏమైందే ?" మందాకిని వెన్నులో సన్నని వణుకు.

"ఈ... ఈయన... మా ఆయన కాదే !" వెనక్కు జరిగింది.

"ఈయన వివరాలు మాక్కూడా తెలీవండీ ! అపస్మారకస్థితిలో ఉన్నాయనను ఎవరో చేర్పించి పోయారు. పేరు మాత్రం శ్రీనివాసే" అని డాక్టర్ సూర్యనారాయణ, కేసు షీటు తెప్పించాడు.

అందులో హాస్పిటల్ రక్తపరీక్ష రిపోర్టు ఉంది. హెచ్.ఐ.వి. పాజిటివ్ ఉంది. అంతా చూశారు.

రోహిణిని ఫోన్ నంబరడిగి అసలు శ్రీనివాసును పిలిపించాడు, డాక్టర్ సూర్యనారాయణ.

ఆఘమేఘాల మీద వచ్చినాయిన "నన్నెందుకు రమ్మన్నారు సార్ ?" అడిగాడు తడబడుతూ. భర్త కనబడగానే రోహిణి ముఖారవిందం సహస్రదళాలుగా విచ్చుకుంది.

విషయమంతా వివరించి శవాన్ని చూపించాడు సూర్యనారాయణ. శ్రీనివాసు సందిగ్ధంలో పడిపోయాడు.

"మ్మ ... మరి... నా రక్తపరీక్ష రిపోర్టు చూడండి" జేబు లోంచి రిపోర్టు తీసి డాక్టర్ కందించాడు.

చనిపోయిన శ్రీనివాసు కేసు షీట్లో, మరో రక్తపరీక్ష రిపోర్టు కనబడింది. అది విమలా డయోగ్నొస్టిక్స్ సెంటర్ వారిది. అందులో హెచ్.ఐ.వి. నెగెటివ్ అని ఉంది.

మూడు రిపోర్టులను వరుసగా ఉంచి చూశాడు డాక్టర్ సూర్యనారాయణ. రెండు రిపోర్టులు విమలా డయోగ్నస్టిక్స్ సెంటర్ వాళ్లవి.

వెంటనే విమలా డయోగ్నిస్టిక్స్ సెంటర్‌కు ఫోన్ వెళ్లింది. లాబ్ అసిస్టెంటు వచ్చాడు. రక్లపరీక్షలన్నీ ఆయనే చేస్తాడక్కడ. విషయమంతా వివరించారు.

ఇద్దరు శ్రీనివాసుల రిపోర్టులు చూసి నాలిక్కరుచుకున్నాడు. రెండు ఒకే రోజువి. ఇద్దరి పేర్లూ ఒకటే.

"పరీక్ష సరిగానే చేశాం కానీ, రిపోర్టు ఒకరిదొకరి కందింది సార్" నీళ్లు నమిలాడు.

ల్యాబ్ అసిస్టెంటును నమలకుండా మింగేయాలనిపించింది శ్రీనివాసుకు.

"సారీ రోహిణీ !" అంటూ పాపను అందుకున్నాడు.

"నా తల్లి... నా బంగారు కొండ... !" ఆత్రుతగా ముద్దాడాడు. ఆ తర్వాత వెయ్యి ఏనుగుల బలమొచ్చింది.

"రిపోర్టుల్లో పేర్ల ముందు ఇంటి పేర్లు రాస్తే ఇంతవరకొచ్చేది కాదు గదా ! నేనే ఎయిడ్స్ రోగిననుకుని నరకయాతన ననుభవించాను. కదులుతున్న శవంలా బతికానంటే నమ్మండి !" హాపీగా భార్య చెయ్యందుకున్నాడు.

"అయ్యారే .... ఆశ్చర్యం ... ! అద్భుతం ...!" మందాకిని రోహిణి జడబట్టి లాగింది.

***(ఆదివారం ఆంధ్రప్రభ - 1-10-2006)***

